క్లుప్తంగా

ఉద్యోగికి సత్కారం



పదోన్నతి పొందిన శ్రీరాములును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లి సచివాలయ వ్యవసాయ సహాయకులుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందిన బండారు శ్రీరాములుకి సిబ్బంది, పంచాయితీ పాలకవర్గ సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల శ్రీరాములు వ్యవయశాఖ శాఖలో వ్యవసాయ విస్తరణ అధికారిగా పదోన్నతి పొందాడు. ఈ నేపథ్యంలో సర్పంచ్ చీకట్ల సునీత, మండల పరిషత్ వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల ఇతర పాలక వర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది శ్రీరాములను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని పదోన్నతులు పొందాలని వారు కోరారు. ఏఓ బలుసు రవి, పంచాయితీ కార్యదర్శి ఎం.సీతారామయ్య, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జోరందుకున్న ఖరీఫ్ పనులు

కె.గంగవరం: ఖరీఫ్ వరి సాగు ఆశాజనకంగా ఉండడంతో రైతులు కోతలకు శ్రీకారం చుట్టారు. స్వల్ప వర్షాపాతం, తెగుళ్ల నుంచి పంటను పూర్తి స్థాయిలో రక్షించుకుని ప్రస్తుతం కోతలు కోసి, యంత్రాల సహాయంతో నూర్పిళ్లు కూడా మొదలు పెట్టారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత రెండు రోజులుగా వాతావరణ మబ్బులతో ఉండడం వల్ల రైతులు కలవరపడుతున్నారు. దీంతో పొలంలోనే ఉండి వీలైనంత త్వరంలో పంటను రక్షించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వాతావరణం పూర్తి స్థాయిలో అనుకూలిస్తే మరో పది రోజుల్లో పూర్తి స్థాయిలో ఖరీఫ్ పనులను ముగించేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. గత మూడేళ్లుగా వరి పంట వల్ల నష్టాలు వచ్చాయని ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉండడంతో చేసిన అప్పులు తీరుస్తామని రైతులు అంటున్నారు. దీంతో పాటు ప్రభుత్వం మద్దతుగా బస్తాకు రూ.2 వేలు ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

23న శెట్టిబలిజ కార్తిక వన సమారాధన



కార్తిక వన సమారాధన తేదీని ప్రకటిస్తున్న సంఘ నాయకులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 23న రామచంద్రపురం నియోజకవర్గ శెట్టిబలిజ కార్తిక వన సమారాధణ నిర్వహించనున్నట్లు నియోజకవర్గ శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు నరాల ఏడుకొండలు సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు మండలంలోని వెంకటాయపాలెంలో పిల్లి అప్పారావు బీసీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో సంఘ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్‌లు వీరబోయిన సూరిబాబు, కట్టా గోవిందు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అంగరలో అయ్యప్పల లక్ష బిల్వార్చన



అంగరలో ఊరేగుతున్న అయ్యప్ప మాలధారులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామంలో సోమవారం అయ్యప్ప మాలధారులు లక్ష బిల్వార్చన చేశారు. పూలమాలలు ధరించి, స్వామిని స్మరిస్తూ అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో ఊరేగారు. 18 కలశాలతో పుణ్య జలాలను తీసుకొచ్చి అభిషేకం చేశారు. ఇరు గ్రామాల భక్తులు పీఠంలో పూజల్లో పాల్గొన్నారు.

ఇకపై పోస్టల్ బ్యాకింగ్ ద్వారా సంక్షేమ పథకాల లబ్ధి

మండపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరాలనే ఉద్దేశంతో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ)ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ పథకాల లబ్ధిని డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో వేయడానికి పోస్టల్ శాఖ బ్యాంకింగ్‌తో అనుసంధానం చేసింది. ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాలు లబ్ధికి పోస్టల్ శాఖలో ప్రతి ఒక్కరూ ఖాతాను తెరుచుకోవడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మండపేట పోస్ట్ మాస్టర్ ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోస్టల్ శాఖలో ఖాతా తెరవడం సులభం అన్నారు. ఇందుకోసం సచివాలయాల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసామని తెలిపారు. అకౌంట్లు ఓపెన్ చేసుకునేందుకు ఈ నెల 15 వరకూ శిబిరాలు నడుస్తాయని చెప్పారు. పోస్టల్ ఐపీపీబీ అకౌంటు తెరవడానికి మొబైల్ ఫోన్, ఆధార్ కార్డు ఉంటే సరిపోతుందన్నారు.

ఏరులై పారుతున్న మద్యం

- రూ.99 కే మద్యమంటూ విక్రయాల పెంపు
- ప్రజల ఆరోగ్యానికి తూట్లు
- మహమ్మారిలా బెల్ట్ షాపులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానమే మేలంటున్న ప్రజలు



మండపేట గొల్లపుంతలో మద్యం షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న స్థానికులు (ఫైల్)



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కోరుమిల్లిలంకలో సారా తయారీ కేంద్రంపై దాడి చేసిన ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

కపిలేశ్వరపురం: రోజంతా శ్రమించినందుకు వచ్చిన ఆదాయాన్ని నేరుగా ఇంటికి తీసుకెళితే ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరుస్తుంది. మద్యం సేవించే దురవాటు వల్ల అనేక కుటుంబాల్లో ఆర్థిక, సామాజిక సమస్యలు తలెత్తి కుటుంబాలు కునారిల్లుతున్నాయి. ఈ సమస్య ఏళ్ల తరబడ ఉన్నప్పటికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అంచెలవారీ మద్య నిషేధాన్ని ప్రకటించింది. అందులో భాగంగా బెల్ట్ షాపులను కట్టడి చేసింది. నాటు సారా తయారీపై ఉక్కుపాదం మోపింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం రూ.99 కే మద్యం అంటూ ప్రజల జీవితాలతో ఆడుకుంటోంది.

నియోజకవర్గంలో మద్యం షాపులు ఇలా...

రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 4, రామచంద్రపురం పట్టణంలో 6, రామచంద్రపురం రూరల్‌లో 4, కాజులూరులో 5 మొత్తం 19 షాపులు ఏర్పాటు చేశారు. మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణంలో 5, రూరల్‌లో 6, కపిలేశ్వరపురం మండలంలో 4, రాయవరం మండలంలో 4 మొత్తం 19 మద్యం షాపులు ఏర్పాటయ్యాయి. వాటిలో కొన్నింటిని జనావాసాల మధ్య నడుపుతున్నారు.

వెల్లువెత్తుతున్న వ్యతిరేకత

రామచంద్రపురం మండలం వెల్ల గ్రామ శివారు వెల్ల సావరం గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును దూరంగా తరలించాలని ఈ నెల 1న మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. సమీప గ్రామాల విద్యార్థులు పాఠశాలలకు అదే రోడ్డులో వెళుతుంటారని మద్యం షాపు ఏర్పాటు చేయడంపై కన్నెర్ర చేశారు. మండపేట పట్టణం గొల్లపుంత రోడ్డు జంక్షన్‌లో మద్యం దుకాణం తెరిచేందుకు ఏర్పాట్లు జరుగుతుండగా నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ ప్రజలు ఆందోళన చేశారు. ఇలా రెండు నియోజకవర్గాల్లోనూ మద్యం షాపుల ఏర్పాటుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

ప్రైవేటు వ్యక్తులు మద్యం షాపులను నిర్వహిస్తుండటంతో లాభమే పరమావధిగా విక్రయాలు పెంచుకుంటున్నారు. అందుకోసం గ్రామాల్లో బెల్ట్ షాపులు తెరిచారు. అనధికారికంగా నడుస్తున్న షాపులు వద్ద అసాంఘిక శక్తుల ఆగడాలు పెరిగాయి. మద్యం సేవించి రహదారులపై వీరంగం చేస్తుండడంతో ప్రజలు అటుగా వెళ్లేందుకు భయపడుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. కపిలేశ్వరపురం మండలంలో ఏడు బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. రాయవరం మండలంలో 20, మండపేట పట్టణంలో మూడు, రూరల్ మండలంలో 10 బెల్ట్ షాపులు నడుస్తున్నట్టు సమాచారం.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పరిస్థితి అదుపు

మద్యం ఎంతగా పేదల కుటుంబాలను కుంగదీస్తున్నాయో బాధిత కుటుంబాల ద్వారా విన్న అప్పటి ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో మద్య నిషేధానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఐదేళ్లలో శాస్త్రీయ పద్ధతిలో దశల వారీగా మద్యాన్ని నిషేధిస్తానంటూ తీవ్రమైన ప్రయత్నం చేశారు. అధికారంలోకి రాగానే ప్రైవేట్ మద్యం షాపులను తొలగించి నిబంధనలు మేరకు ప్రభుత్వ షాపులను నడిపింది. గ్రామాల్లో విచ్చలవిడిగా ఉన్న బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేసింది. మద్యానికి బానిసలైన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి మద్యం మహమ్మారి నుంచి కాపాడేందుకు సాధ్యమైనంత వరకూ కృషి చేసింది.

నాటుసారా కోరలు పీకి..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్షేత్ర స్థాయిలో మద్య రవాణా, నాటుసారా తయారీ తదితర నేరాలపై ఎక్సైజ్ అధికారులు నిఘా వేసి చట్ట పరిధిలో చర్యలు తీసుకునేవారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే గ్రామాల్లో చర్యలను వేగవంతం చేసింది. 2020 జనవరి 7న మండపేట ద్వారపూడి శివారు వేములపల్లిలో దాడి చేసి ఆలమూరు సీఐ వై.పట్టాభిరామయ్య చౌదరి ఆధ్వర్యంలోని సిబ్బంది 1,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. మే 24న కపిలేశ్వరపురం మండలంలోని అద్దంకివారిలంక వ్యవసాయ క్షేత్రంలో రామచంద్రపురం ఎక్సైజ్ సీఐ ఎం.అరుణకుమారి, అంగర పోలీసులు సంయుక్తంగా దాడి చేసి 1,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 450 కిలోల బెల్లాన్ని స్వాధీన పరుచుకున్నారు. మే 26న అద్దంకివారిలంక, కోరుమిల్లి గ్రామాల్లో దాడులు చేసి 1,500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఇలా వైఎస్సార్ సీపీ పాలనా కాలమంతా నాటుసారాపై ఉక్కుపాదం మోపుతూ అక్రమ మద్యాన్ని నియంత్రించింది.

> **ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తుంది**
>
> 
>
> మద్యాన్ని నిషేధించి పేద, మధ్య తరగతి కుటుంబాలు, సామాజిక ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. కూటమి ప్రభుత్వం రూ.99 కే మద్యం అంటూ ఎన్నికల ఎత్తుగడ వేసింది. గెలిచాకా ప్రభుత్వాదాయాన్ని పెంచుకునే దిశగా మద్యం విక్రయాలను పెంచుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజారోగ్యం దెబ్బతింటుంది.
>
> –కె.కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా నాయకురాలు, మండపేట

వైభవంగా గౌరీదేవి సంబరం



రాయవరంలో నిర్వహిస్తున్న గౌరీదేవి సంబరం

రాయవరం: గౌరీదేవి సంబరాన్ని రాయవరంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. బసవేశ్వర దేవాంగ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి మూడేళ్లకొకసారి గౌరీదేవి సంబరాన్ని నిర్వహించడం ఆనవాయితీ. గౌరీదేవిని దేవాంగ సామాజిక వర్గం ఆడబడుచుగా భావిస్తుంటారు. అట్లతద్దె రోజున గౌరీదేవిని వరి దుబ్బు రూపంలో మేళ తాళాలతో గ్రామంలోకి తీసుకు వచ్చారు. అప్పటి నుంచి ఆండ్ర వీరసాత్విక అనే పదేళ్ల బాలికతో పూజాదికాలు నిర్వహింపజేశారు. గౌరీదేవి సంబరానికి ఐదు రోజుల ముందు గౌరీదేవి సోదరుడైన బసవ దేవుడ్ని తీసుకు వచ్చి పూజలు చేస్తున్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పాకలో వరిదుబ్బు రూపంలో ఉన్న గౌరీదేవిని, విభూతి పండు రూపంలో ఉన్న బసవదేవుడ్ని ఉంచి పూజాదికాలు నిర్వహిస్తున్నారు. వారిని తిరిగి సాగనంపే క్రమంలో భాగంగా సంబరం నిర్వహించారు. కేరళ వాయిద్యాలతో గౌరీదేవిని ఊరేగింపు నిర్వహించారు. వీరశైవుల నృత్యాలు, కోయ డ్యాన్సులు, బుట్టబొమ్మలు, సంగీత విభావరుల వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కుందుం వీరభద్రరావు, ఆండ్ర బసవరాజు, అల్లక సత్యనారాయణ, ఆండ్ర సత్యనారాయణ, ఆండ్ర సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐలాజ్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి



ఐలాజ్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్న న్యాయవాదులు

రామచంద్రపురం: ఈ ఏడాది డిసెంబరు 8 న కాకినాడ జిల్లా అన్నవరంలో నిర్వహించనున్న ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) మొదటి రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ సోమవారం పిలుపు ఇచ్చారు. దేశవ్యాప్తంగా న్యాయవాదుల ప్రయోజనాలు కాపడటంలోను, ప్రజల హక్కులను కాపాడటంలోను ఐలాజ్ ముందుంటుందని పేర్కొన్నారు. కోర్టుల్లో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులకు సౌకర్యాలు, ప్రయోజనాలు కల్పించాలని, న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని, న్యాయ విద్య చదువుతున్న విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని, మానవ హక్కుల కోసం, పౌర హక్కుల కోసం పోరాడే న్యాయవాదులపై ప్రభుత్వాలు నిరంకుశ నల్ల చట్టాలను ప్రయోగించడం ఆపాలని ఐలాజ్ పిలుపు ఇస్తుందన్నారు. 60 సంవత్సరాలు పైబడిన న్యాయవాదులకు పింఛన్ అందివ్వాలని, జూనియర్ న్యాయవాదులకు స్టైపెండ్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో అన్నవరం శ్రీశేషాద్రి సదన్‌లో జరగనున్న రాష్ట్ర మహాసభను న్యాయవాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐలాజ్ కన్వీనర్ బుగతా శివ, కన్వేయింగ్ కమిటీ సభ్యురాలు ఎ.దేవి, బార్ అసోసియేషన్ కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు కముజు సూర్యనారాయణ, కె.భరత్‌కుమార్, సూరంపూడి సత్యనారాయణ, సాదే నారాయణ, కె.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తుంటే 112 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి

మహిళా సంరక్షణ సదస్సులో టౌన్ ఎస్‌ఐ శాస్త్రి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న టౌన్ ఎస్‌ఐ శాస్త్రి

మండపేట: విద్యార్థినులు తమ తల్లిదండ్రులను, విద్యనేర్పే గురువుల అడుగు జాడల్లో నడుచుకుంటేనే అనుకున్న లక్ష్యాలకు చేరువ అవుతారని మండపేట టౌన్ ఎస్‌ఐ హరికోటి శాస్త్రి అన్నారు. మహిళా సంరక్షణ చర్యల్లో భాగంగా రూరల్ సీఐ పీతల దొరరాజు సూచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఐ శాస్త్రి సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఏఎస్‌ఐ చిన్నారావును వెంటబెట్టుకుని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, జవహర్‌లాల్ మున్సిపల్ హైస్కూళ్ల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలు, ఆడబిడ్డల కోసం ప్రభుత్వం అమలు చేసిన చట్టాల గురించి ఎస్‌ఐ శాస్త్రి వివరించారు. మహిళలపై దాడుల నిరోధానికి పోలీసులుగా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లేటపుడు ఆకతాయిలు వేధిస్తుంటే 112 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో బ్లూ కోట్ కానిస్టేబుల్ నాగముని, మహిళా సురక్ష టీం సభ్యురాలు దుర్గ, కానిస్టేబుల్ శ్రీదేవి, విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో నీటి సంఘాల ఓటర్ల జాబితా

కాజులూరు: నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా గ్రామ సచివాలయాల్లో ఉంచినట్లు మండల తహసీల్దార్ ఎల్.శివకుమార్ తెలిపారు. సోమవారం కాజులూరులో ఓటర్ల జాబితా ఏర్పాటు ప్రక్రియను తహసీల్దార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకూ నీటి సంఘాల ఎన్నికలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఓటర్ల జాబితా తయారు చేసి గ్రామ సచివాలయాల్లో ఉంచామని రైతులగా ఉండి ఎవరి పేర్లయినా ఓటరుగా నమోదు కానట్లయితే స్థానిక వీఆర్వోను సంప్రదించి సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఈశ్వరరావు, సుబ్రహ్మణ్యం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పీఠంలో లక్ష బిల్వార్చన, కుంకుమార్చన



పీఠంలో అష్టమ లింగేశ్వరునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు



పీఠంలో నిర్వహిస్తున్న లక్ష బిల్వార్చన

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. పీఠంలోని అమ్మవారి పాద ముద్రికలు కార్తిక శుద్ధ దశమి రోజు వెలిసినట్టుగా పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ తెలిపారు. పీఠంలోని అమ్మవారికి లక్ష కుంకుమార్చన, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి లక్ష తులసి, భవానీ శంకర సమేత అష్టమ లింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారికి దుర్గా, లలితా, సరస్వతి, భవానీ, పార్వతి, తులసి, లక్ష్మీ అష్టోత్తరాలతో, దుర్గా ద్వా, త్రిశంస నామావళితో లక్ష కుంకుమార్చన జరిపారు. పురోహితులు వీరావధాని, మాధవాచార్యులు అర్చకత్వంలో 10 మంది వేద పండితులు పూజలు నిర్వహించారు.

హరహర మహాదేవ శంభోశంకర

- శివనామస్మరణతో మార్మోగిన మందిరాలు
- సోమేశ్వరంలో జ్యోతిర్లింగార్చన



వల్లూరులో అగస్త్యేశ్వరస్వామికి అభిషేకం



ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి నిర్వహించిన అభిషేకాలు



ద్రాక్షారామ ఆలయ ప్రాంగణంలో కార్తిక నోముల ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటున్న భక్తులు

రాయవరం: హరహర మహాదేవ శంభోశంకర .. నినాదం మార్మోగాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా శివ నామస్మరణ ప్రతిధ్వనించింది. కార్తిక మాసం రెండవ సోమవారం కావడంతో మహారుద్రుడిని దర్శించుకునేందుకు వేకువజాము నాలుగు గంటల నుంచే భక్తులు శివాలయాలకు పోటెత్తారు. మహిళలు ఆలయ ధ్వజస్తంభం వద్ద కార్తిక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. చారిత్రక శివాలయాలైన సోమేశ్వరం బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు ఉమా సోమేశ్వరస్వామి, రాయవరం పార్వతీ సమేత రాజరాజేశ్వరస్వామి, చెల్లూరు బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి, పసలపూడి రాజేశ్వరస్వామి తదితర శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. రుద్రుడికి భక్తులు పంచదార, తేనె, పసుపు, కుంకుమ, విభూది, చందనం, పాలు, పెరుగు, ఆవునెయ్యి పండ్లరసాలతో అభిషేకించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వేకువజామున భక్తులతో ప్రారంభమైన క్యూలైన్లు ఉదయం 10 గంటల వరకూ కొనసాగాయి. ఉదయం నుంచి ఉపవాస దీక్ష చేపట్టిన పలువురు మహిళా భక్తులు సాయంత్రం పురోహితులకు స్వయంపాకం అందజేశాక ఉపవాస దీక్ష విరమించారు. స్వయంపాకంతో పాటు కొందరు దీపాలు దానం చేశారు. సోమేశ్వరం శివాలయంలో ప్రధానార్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో కార్తిక దీపారాధన నిర్వహించారు. లింగాకారంలో దీపాలను ఏర్పాటు చేసి జ్యోతిర్లింగార్చన నిర్వహించారు.

వర్తక సంఘం ఆధ్వర్యంలో

సోమేశ్వరం శివాలయంలో స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో 21వ కార్తిక వన సమారాధన నిర్వహించారు. సోమేశ్వరం, మాచవరం, కుతుకులూరు తదితర గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల మంది అన్నసమారాధనలో పాల్గొన్నారు.

మార్మోగిన శివనామ స్మరణ

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. రెండో సోమవారం కావడంతో 19 గ్రామాల్లోని శివాలయాలు, వన భోజన కార్యక్రమాలతో సందడిగా మారాయి. చంద్రుడు ప్రతిష్ఠించిన అష్ట సోమేశ్వరాలయాల్లో నాలుగో ఆలయమైన కోరుమిల్లిలోని సోమేశ్వరస్వామి ఆలయానికి ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అర్చకులు సోమేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ దేవిలను విశేషంగా అలంకరించారు. పడమర ఖండ్రికలో ఉయ్యాల జంపాల దైవ క్షేత్రంలో కొలువైన అన్నపూర్ణాదేవి సమేత త్రయంబకేశ్వరస్వామి, కపిలేశ్వరపురంలోని పాపవినాశేశ్వర, అగస్త్యేశ్వరస్వామి, అంగర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పడమర ఖండ్రికలోని ఖణ్వలింగేశ్వరస్వామి, తాతపూడిలోని మల్లేశ్వరస్వామి, మాచరలోని ఉమా రాజలింగేశ్వర స్వామి, నేలటూరులోని బసవలింగేశ్వరస్వామి, వాకతిప్ప, వల్లూరు, టేకి గ్రామాల శివాలయాల్లో కార్తిక పూజలను వైభవంగా చేశారు.

ద్రాక్షారామకు వెల్లువెత్తిన భక్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో వేంచేసిన మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామివారి ఆలయానికి రెండో కార్తిక సోమవారం పురస్కరించుకుని భక్తులు వెల్లువెత్తారు. తెల్లవారు జాము నుంచే ఆలయానికి అధిక సంఖ్యలో చేరుకుని ఆలయ ప్రాంగణంలోని సప్తగోదావరి నదిలో స్నానమాచరించి భీమేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలాల్లో కార్తిక నోములకు సంబంధించిన ప్రత్యేక పూజలు రుత్వికులతో నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో ఆవు నేయి వత్తులను వినియోగించి స్త్రీలు దీపారాధన నిర్వహించడం ద్వారా కార్తిక మాస ప్రతిష్ఠను, వ్రత మహాత్యాలను తెలుసుకున్నారు. ఆలయ ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శివాలయాల్లో భక్తుల సందడి

కాజులూరు: మండలంలోని శివాలయాల్లో సోమవారం భక్తులతో సందడి నెలకొంది. కార్తిక మాసం సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి హరహర మహాదేవ శంభోశంకరా... ఓం నమశ్శివాయ... అంటూ శివనామ స్మరణతో శివాలయాల్లో ప్రదక్షిణలు చేశారు.

తెల్లవారుజాము నుంచే స్వామికి అభిషేకాలు చేయించుకునే భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, శీల, దుగ్గుదూరు, కుయ్యేరు, అయితపూడి, పెనుమళ్ల, ఆండ్రంగి, పల్లిపాలెం, ఉప్పుమిల్లి, కోలంక, జగన్నాథగిరి గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారు జామున నాలుగు గంటల నుంచే అభిషేకాలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లోని పిల్లలు, పెద్దలు, మహిళలు శివాలయాలకు వెళ్లి వారి శక్తిని బట్టి ఆలయం చుట్టూ మూడు నుంచి 108 ప్రదక్షిణలు చేసి, స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేయించి, స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



రాయవరంలో పసుపు, కుంకుమాభిషేకంలో అర్ధనారీశ్వరుడిగా అలరారిన రాజేశ్వరస్వామి



సోమేశ్వరంలోని చారిత్రక శివాలయంలో శివునికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



సోమేశ్వరం శివాలయంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



ద్రాక్షారామలో దర్శనానికి వేచియున్న భక్తులు



గొల్లపాలెం శివాలయంలో స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు